# నలిగిన బాల్యం

జి. అనసూయ

కథ



"మమ్మీ ఐస్క్రీమ్ తిందాం" తొమ్మిదేళ్ళ అనూష తల్లి చెయ్యి పట్టుకుని లాగుతూ ఐస్క్రీమ్ పార్లర్‌లోకి లాక్కెళ్ళింది.

ఎగ్జిబిషన్‌స్టాల్స్ ఒకొక్కటే చూస్తూ నడుస్తున్న సుహాసిని ఇక తప్పదన్నట్లు పార్లర్‌లోకి వెళ్ళి ఓ టేబుల్‌దగ్గర కూర్చుంది. ఐస్క్రీమ్ ఆర్డర్‌చేసి యధాలాపంగా ప్రక్కకు చూసిన సుహాసిని ఉలిక్కిపడింది.

ప్రక్క టేబుల్‌దగ్గర పదేళ్ళబాబు తెల్లగా ముద్దొస్తూ ఎత్తుకు తగ్గ లావుతో, ఉంగరాల జుట్టుతో కానీ... నోట్లో వ్రేలేసుకుని వెఱ్ఱిచూపులు చూస్తూ... మరో నిమిషంలో ఐస్క్రీమ్ కోన్స్ చేతిలో పట్టుకొని వాళ్ళ డాడి..అది ఎవరో కాదు వినయ్..తన భర్త. కాదు తాను వద్దనుకొని వదిలేసుకున్న వినయ్... ఆ బాబు తనకొడుకు..అదేంటి వాడలా ఉన్నాడు. తన తొలిబిడ్డ.. తమ కలల పంట. అమ్మ..అమ్మ...అంటూ తన కొంగు పట్టుకొని తిరిగే మూడేళ్ళ పసివాడు కళ్ళముందు తిరిగాడు. ఒక్కసారి వెళ్ళి వాడిని తనగుండెలకు హత్తుకోవాలని అనిపించింది సుహాసినికి.

ఒక్కక్షణం సుహాసినికేసి చూసిన వినయ్ మొహంలో రకరకాల భావాలు. కోపం, అసహ్యం, జుగుప్స కలగలిసిన భావం. తిరస్కారంగా చూపులు మరల్చు కుంటూ కొడుకు భుజం పట్టుకొని లేవదీసాడు..అద్దీ పద.... నీకు అక్కడ బొమ్మలు కొనిపెడతాను అంటూ బయటకు లాక్కుపోతున్నాడు. "నా ఐస్క్రీమ్.." క్రింద పడిన ఐస్క్రీమ్ వైపు చూస్తూ బలవంతంగా తండ్రివెంట వెళుతున్నాడు ఆదిత్య.

"మమ్మీ ఐస్క్రీమ్ కరిగి పోతుంది. తొందరగా తిను" హెచ్చ రించింది అనూష....ఎక్కడో దీర్ఘంగా చూస్తున్న తల్లిని చూస్తూ నీళ్ళు తిరుగుతున్న కళ్ళను వత్తు కుంటూ, ఐస్క్రీమ్ నోట్లో పెట్టుకున్న సుహాసినికి ఐస్క్రీమ్ చేదుగా అనిపించింది.

ఇక ఏదీ చూడాలనిపించలేదు. అనూషకు అడిగినవన్నీ కొనిచ్చి, ఇంటికి చేరిన సుహాసినికి తెల్లవార్లూ నిద్ర కరువైంది.

"ఆగు నాన్నా..... నా ఐస్క్రీమ్... నా ఐస్క్రీమ్.. క్రిందపడిపోయింది..."అంటూ వెనక్కి వెనక్కి చూస్తూ తండ్రివెంట వెళ్ళిపోతున్న ఆదిత్యే కళ్ళ ముందు మెదులుతున్నాడు.

మనసు తన ప్రమేయం లేకుండానే గతంలోకి

జారుకుంది.

★★★★★

తను పి.జి. చదువుతున్న రోజులు. వినయ్ కూడా అదే కాలేజీలో ఇంగ్లీష్ లిటరేచర్ చదువుతుండేవాడు. సినిమా హీరోలాంటి పర్సనాల్టి...మంచి బాలుడి లాంటి అతనిప్రవర్తన, చదువులో అతని టాలెంట్. సుహాసిని చలాకీతనం ఆర్గనైజేషన్‌లో ఆమె ఆక్టివ్‌నెస్, ముక్కుకు సూటిగా పోయే ఆమె నిక్కచ్చితనం ఇవన్నీ వాళ్ళిద్దర్ని దగ్గర చేశాయి. ఒకర్ని విడచి మరొకరు ఉండలేనంత ఆకర్షణను పెంచాయి. ఒకరికొకరు మరొకరు ఉన్నతంగా, ఉదాత్తంగా కనిపించారు. రిజిస్టర్‌ఆఫీసులో, స్నేహితుల సన్నిహితుల సమక్షంలో ఒకటైన వినయ్ సుహాసినిల కాపురం ఏడాది పాటు ఆనందంగా గడిచిపోయింది. వినయ్ ఓ ప్రైవేటు కాలేజిలో లెక్చరర్‌గా చేరాడు.

పుస్తకాలు, చదువుతోనే రోజంతా గడిపే వినయ్ ప్రవర్తన విసుగ్గా అనిపించసాగింది సుహాసినికి.

ఎప్పుడూ మీటింగ్స్,సెమినార్స్ అంటూ రోజంతా బయటే గడిపే సుహాసిని సంసారపక్షంగా కనిపించలేదు వినయ్‌కు.

"ఏంటి పెళ్ళయితే నాలుగు గోడలకు బందీ అయి బ్రతకాలా?నేనేం నీలా పల్లెటూరిమొద్దునికాను. పొద్దస్తమానం బావిలో కప్పలా పడి ఉండటానికి" సుహాసిని నోటి దురుసుతనం వినయ్ సహనానికి పరీక్షలా మారింది. మాటా మాటా పెరిగి చెయ్యి చేసుకునేంత వరకు వెళ్ళింది వ్యవహారం.

ఈలోగా బాబు పుట్టాడు. పసిపిల్లవాడు...బయట పనులతో, ఇంటిపని వత్తిడితో సతమతమౌతున్న సుహాసినికి వినయ్ బాధ్యతారాహిత్యం భరించలేనట్టు అనిపించేది. "ఏమిటి తాను సంపాదించి ఓ రెండువేలు నా మోహన కొడితే చాలనుకొంటున్నాడా ఇంటి బాధ్యత పిల్లవాడి బాగోగులు ఇవేవి ఆయనకు పట్టవా !"అలకలూ మౌనవ్రతాలనుండి రోజుల తరబడి మాట్లాడుకోనంత దూరం వెళ్ళింది ఆ దూరం. ఈలోగా తాను మరోసారి ప్రెగ్నెంటని తెలిసింది. ఈసారి ఆడపిల్ల. ఆర్థిక ఇబ్బందులు, పిల్లల బాధ్యతలు. వినయ్‌లో మార్పేమీ లేదు. విసిగిపోయింది సుహాసిని.

లెక్చరర్‌గా ప్రభుత్వ కళాశాలలో అప్పాయింట్‌మెంట్ రాగానే పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోయింది తను. ఆరునెలల పాటు అతనిగురించిపట్టించుకోలేదు. అతనూ రాలేదు. ఫోను చేస్తే మాట్లాడలేదు తను.

ఓ రోజు వచ్చాడు వినయ్. తనేం మాట్లాడలేదు. బాబును తీసుకొని వెళ్ళిపోయాడు. "చూద్దాం ఎలా మానేజ్ చేస్తాడో" అనుకుంది తను.

బాబు కోసమైనా తను రాజీ పడకపోతుందా అన్నది అతని ఉద్దేశ్యం. స్నేహితులు,శ్రేయోభిలాషులు అటూ ఇటూ కూడా చెప్పిచూశారు. తలొగ్గితే లోకువైపోతామేమోనని పంతాలు పట్టుకు కూర్చున్నారు ఇద్దరూ. ఎక్కడివాళ్ళక్కడే ఉండి పోయారు. బాబును ఇదే చూడటం ఆతరువాత వినయ్‌లో పెద్దగా మార్పులేదు. కొద్దిగా లావయ్యాడు. వయసుతో వచ్చిన హుందాతనంతో మరింత స్మార్ట్‌గా కనిపిస్తున్నాడు. కాని బాబే...బిత్తరచూపులు...నోట్లో వ్రేలు తడబడుతూ చిన్నపిల్లవాడిలా....నత్తి నత్తిగా మాటలు.

"మైగాడ్ బాబు రిటార్టెడ్ కాదు కదా". తను ఇన్నాళ్ళూ బాబు తండ్రిదగ్గరహాయిగా ఆరోగ్యంగా పెరుగు తున్నాడనే అనుకుంటున్నది. కాని... తమ పట్టుదలలు, మూర్ఖత్వం బాబు మీద ఇలాంటి ప్రభావాన్ని చూయిస్తాయని అనుకోలేక పోయింది. ఇదంతా తన వల్లేనా..సుహాసిని హృదయం పశ్చాత్తాపంతో కుమిలిపోయింది.

"ఒక్కసారి వినయ్‌తో మాట్లాడితే భాబును తనకు

**ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం**

స్కౌట్ ఉద్యమనేత బెడెన్ పావెల్ జన్మదినోత్సవమయిన ఫిబ్రవరి 22ను స్కౌట్స్ దినోత్సవంగా జరుపుతారు. ఈయన మిలట్రీలో పనిచేశారు. 1890లో 'ఎయిడ్స్ టు స్కౌటింగ్' అనే పుస్తకాన్ని రాశాడు. 1907లో 20 మంది బాలురుతో బ్రౌన్‌సీతో పోలండ్ వద్ద మొదటి స్కౌట్‌క్యాంపును నిర్వహించాడు. 1919లో ఇంగ్లాండ్‌లోని గిల్‌వెల్‌లో అంతర్జాతీయ స్కౌట్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించాడు.

ఇచ్చెయ్యమని అడిగితే...." అయిదుసంవత్సరాల నుండి గుర్తుకురాని బాబు ఇప్పుడు గుర్తొచ్చాడా అంటాడేమో. నేను అక్కర్లేని దానికి బాబు మాత్రం ఎందుకు అంటాడేమో...గజిబిజిగా ఆలోచనలు.

ఈ అయిదేండ్లలో ఎన్నో అనుభవాలను, అవమానాలను రుచి చూసింది తను. పెళ్ళయి ఒంటరిగా ఉన్నస్త్రీకి సమాజంలో ఉన్న స్థానం పైకిచూపేగౌరవాభిమానాల వెనుక ఉండే వెకిలితనం అర్థమైనకొద్దీ బయట వ్యాపకాలు పూర్తిగా తగ్గించింది. అందరిలా తనకు నాన్న ఎందుకు లేదని ప్రశ్నించే అనూషకు జవాబు చెప్పలేని అసహాయత, ఒంటరితనం,మానసికవత్తిడి. తనుతొందరపడిందేమో. తను సర్దుకు పోవాల్సిందేమో. వినయ్ చెడ్డవాడేమీ కాదు. తనే అపార్థం చేసుకుందేమో....సుహాసినిలో అంతర్మథనం మొదలైంది.

వినయ్ వున్న ఊళ్లోనే తన స్నేహితురాలు ఉంటోంది. ఓ సారి ఫోను చేస్తే.

స్నేహితురాలు చెప్పిన విషయాలు నమ్మశక్యంగా అనిపించలేదు.

వినయ్ పూర్తిగా మారిపోయాడు.బాగా డ్రింక్స్‌కు అలవాటయ్యాడు. బాబు సెకండ్ క్లాస్ వరకు బాగానే ఉన్నాడు. ఓసారి హైఫీవర్ వచ్చి ఫిట్స్ వచ్చాయి. అప్పట్నుండి ఇలా డల్‌గా....అయిపొయ్యాడు. ఇంట్లో బాబును చూసుకోవడానికి ఓ పనిమనిషిని పెట్టుకున్నాడు.వయసులో ఉన్నఅమ్మాయి.భర్త పోయాడట. బాబు కోసమని పేరే గాని... భర్తపోయి వయసులో ఉన్న అమ్మాయి ఇంట్లోనే ఉండి అన్ని అవసరాలు తీరుస్తోందని అంతా అనుకుంటున్నారట.ఇంకొన్నాళ్ళు పోతే బాబు పూర్తిగా పాడవుతాడేమో,"సుహాసినీ జరిగిందాంట్లో మొత్తం నీ తప్పే అని నేను అనను గాని పరిస్థితి ఇంత దూరం రాకుండా చూడాల్సిన బాధ్యతను నీవు విస్మరించావు. అయితే ఇప్పటికీ మించిపోయింది లేదు.చట్టరీత్యా మీ మధ్య బంధం ఇంకా తెగిపోలేదు. నీలోఇంకా మాతృత్వం, మానవత్వం మిగిలి ఉంటే వచ్చి నీబాబును, నీ భర్తను రక్షించుకో. మీ ఆవేశాల మధ్య కోపతాపాల మధ్య ఆ పసివాళ్ళను నలగనీయకండి."

> **కవలల దినోత్సవం**
>
> మొట్టమొదటి కవలల దినోత్సవం పోలెండ్‌వారు 1976లో జరుపుకున్నారు. మోజస్, ఆరన్ విల్ కాక్స్ అనే కవల సోదరులుండేవారు. తాము వుంటున్న ఊరుకి 'ట్విన్స్ బర్గ్' అని పేరు పెట్టారు. ఇద్దరూ అక్కాచెల్లెళ్ళను వివాహమాడారు. ఇద్దరికి సమాన సఖ్యలో సంతానం కలిగారు. విచిత్రంగా ఒకే రకమైన వ్యాధితో బాధపడుతూ ఒకేరోజున మరణించారు. వీరి గౌరవార్థం 1976 నుంచి ప్రతి సంత్సరం ఫిబ్రవరి22న కవలలదితోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

స్నేహితురాలి హితువు ఎప్పటిలా కోపం తెప్పించలేదు సుహాసినికి. ఇంకఆగలేకపోయింది. ప్రేగుబంధం ముందు పట్టుదల ఓడిపోయింది. అనూషను ఓ ఫ్రెండింట్లో ఉంచి బయలుదేరింది. నాలుగు గంటల బస్సు ప్రయాణం.

అడ్రసు పట్టుకొని వినయ్ ఉంటున్న ఇల్లు కనుక్కొని వెళ్ళేసరికి సాయంత్రం ఆరుగంటలు. నేమ్ బోర్డు చూసి తలుపు తట్టబోయి తీసే ఉండటంతో లోపలికి చూసింది. బాబు ఒక్కడే నేలమీద కూర్చుని టీ.వీ. చూస్తూ ఉన్నాడు. కళ్ళు పెద్దవి చేసి. నోట్లో వ్రేలు వేసుకొని చొంగ కారుస్తూ కళ్ళార్పకుండా చూస్తున్నాడు.

మీ డాడీ లేరా! తన గొంతు విని లోపలి నుండి వచ్చిన స్త్రీ..ముప్పయేళ్ళు ఉంటాయేమో. అందంగా చలాకీగా ఉంది. తెల్లటి తెలుపు సహజసౌందర్యం. సౌమ్యం సంస్కారం ఉట్టిపడుతున్న మొహం. వినయ్ ఆ అమ్మాయికి ఎందుకు అట్రాక్ట్ అయ్యాడో అర్థం అయ్యింది సుహాసినికి.

తను వినయ్ దూరపు బంధువునని పని మీద ఈ ఊరు వచ్చానని పరిచయం చేసుకుంది సుహాసిని. కూర్చొమ్మని కాఫీ ఇచ్చింది. వినయ్ గారు వచ్చేసరికి చాలా లేటవుతుంది మేడం. మీరు భోజనం చేసి పడుకోండి. ఆయన వచ్చాక లేపుతాను. అలసటగా ఉన్న సుహాసినిని చూస్తూ అంది. టీ.వీ. చూస్తున్న బాబు అలాగే నేలమీద పడుకొని నిద్రపోతున్నాడు. వాడి ప్రక్కన కూర్చొని "బాబు అన్నం తిన్నాడా....." అడిగింది సుహాసిని. "మీరు వచ్చేముందే పెట్టాను.

కొంచెం పెందలాడే తింటాడు." అంది సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్లు...వాడిని లేపి మంచంమీద పడుకోబెడుతూ... "రండి మేడం, మీరు భోజనం చెయ్యండి" అంది. మౌనంగా లేచి కాళ్ళు మోహం కడుక్కొని వచ్చింది సుహాసిని.

జ్యోతి వడ్డిస్తుండగా ఏవో ఆలోచనలలో మునిగి మౌనంగా భోజనం ముగించింది. "ఎంత విచిత్రం తనింట్లో తనకు అతిథి మర్యాదలు".తనకు చూపించిన గదిలోకి వెళ్ళింది. గది నీట్‌గా అందంగా ఉంది. బాబు గదేమో... మంచం మీద వ్రాలగానే నిద్ర పట్టేసింది. ఏదో అలికిడి వినబడి మెలుకువ వచ్చి గడియారం వైపు చూసింది. పన్నెండు కావస్తున్నది.

బయటమాటలు వినపడుతున్నాయి. "మీ బంధువులట వచ్చారు. నిద్రపోతున్నట్టున్నారు. ప్రొద్దున్నే కలవచ్చు...రండి మీకు భోజనం వడ్డిస్తాను" జ్యోతి గొంతు మెత్తగా ఉంది.

"బాబు తిన్నాడా...నాకు భోజనంవద్దు..తినేశాను.నాకు నిద్రొస్తోంది.నువ్వెళ్ళి తినిరా.." తలుపులు మూసిన శబ్దం.

ప్రొద్దున్నే అలవాటుగా అయిదుగంటలకు నిద్ర లేచిన సుహాసిని హాల్లోకి వచ్చింది. మంచం మీద నిద్రపోతున్న బాబు కనిపించాడు. నెమ్మదిగా వాడి ప్రక్కన కూర్చుని నుదిటి మీద చెయ్యేసింది. ఒక్కసారి కళ్ళు తెరిచి చూసి మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు.

గది తలుపులు తీసుకొని బయటకు వచ్చిన జ్యోతి.... మొహమాటంగా చూసింది.

"మేడం, ఒక్క విషయం చెప్పాలి. అలా బయటకు వస్తారా" అంది... బయట చెట్ల దగ్గర నిలబడ్డారు ఇద్దరూ.

"మేడం మీరు సుహాసిని గారని వినయ్ భార్య అని నాకు తెలుసు.మీ ఆల్బమ్‌లో ఫోటోలు చూశాను. వినయ్‌గారు మిమ్మల్ని మరచిపోలేదు. ఆయన హృదయంలో మీస్థానం ఎప్పటికి మీదే. నేను కేవలం అతిథి పాత్రను మాత్రమే. వినయ్ గారికి, బాబుకు మీ ప్రేమానురాగాలు చాలా అవసరం. మీరు సావకాశంగా మాట్లాడుకొని నిర్ణయం తీసుకోండి. మీరు కలిసి సంతోషంగా ఉండగలిగితే మొదటగా సంతోషపడేది నేనే. వస్తాను." అంటూ గేటు తీసుకొని వెళ్ళిపోతున్న జ్యోతిని ఆపాలని కూడా తోచలేదు సుహాసినికి.

"జ్యోతీ! బాబు లేచాడా!" వినయ్ పిలుపు. తను పలకలేదు. "జ్యోతీ నిన్నే బాబు లేచాడా!" దగ్గరకు రాబోయిన వినయ్ సుహాసినిని చూసి స్థాణువులా నిలబడిపోయాడు.

"సుహాసినీ...నువ్వు..ఇక్కడ...ఎందుకు వచ్చావు. సుహాసిని మరోసారి మాజీవితాలతో ఆడుకోవడానికా..చూడు బాబు..బాబెలా అయిపొయ్యాడో..." ఆవేశం దుఃఖం నిండిన గొంతుతో అన్నాడు వినయ్.

తండ్రి అరుపులకు నిద్ర లేచిన బాబు ఇద్దరి వైపు మార్చి మార్చి చూశాడు.

"ఈమె.. ఎవరు నాన్నా...కొత్త ఆయానా..." అమాయకంగా తండ్రిని అడిగాడు.

ఇంక ఆగలేకపోయింది సుహాసిని.

"బాబూ.. నేను మీ అమ్మనురా. రా....నాన్నా" అంటూ వాడిని గుండెలను హత్తుకుంది ఏడుస్తూ.

"వద్దు సుహాసిని వాడికి ఆశలురేపకు, గాజు బొమ్మలాంటిది వాడిమనసు చిన్నదెబ్బకూడా తట్టుకోలేదు.దయచేసి నీదారిన నీవు వెళ్ళిపో.. మమ్మల్ని ఇలా బ్రతకనివ్వు," ఆవేదనగా అన్నాడు వినయ్.

"లేదు వినయ్ నేను వెళ్ళడానికి రాలేదు. నేను పోగొట్టుకున్నదేమిటో నాకు తెలిసింది. బాబుకు తల్లి లేకుండా, పాపకు తండ్రి లేకుండా జరిగిన అన్యాయం, అందుకు నాబాధ్యత నాకు తెలిసొచ్చింది. ప్లీజ్ నన్ను వెళ్ళిపొమ్మనకు. మన పట్టుదలలకు పిల్లలు బలికావడం నేను భరించలేను వినయ్ రెండు చేతులూ పట్టుకొని కన్నీళ్ళతో అంది సుహాసిని."

భయంగా ఇద్దరివైపు మార్చి మార్చి చూస్తున్న బాబు పరుగెత్తుకుంటూ వెళ్ళి అల్మారాలో ఉన్న సుహాసిని వినయ్‌ల పెళ్ళి ఫోటో తెచ్చాడు. "అమ్మ...నాన్న...." అంటూ పాటలా పాడుతూ ఫోటో సుహాసిని చేతికి ఇచ్చాడు... ఫోటోలో ఆమెను చేతి వ్రేలితో చూపిస్తూ.

అవును నాన్నా నేను మీఅమ్మను.... వాడి తలను నిమురుతూ లాలనగా అంది సుహాసిని. ★